క్లుప్తంగా

31న మండల మీట్

వెదురుకుప్పం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని 31న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ముగిసిన మాతమ్మ తిరునాళ్ల


మాతమ్మను దర్శించుకుంటున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

విజయపురం (నగరి) : మండలంలోని కేశవపురం ఆదిఆంధ్రవాడలో జరుగుతున్న మాతమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా పలువురు భక్తులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సచివాలయంలో తనిఖీలు


తిరుమలరాజపురం సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరి పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిరుమలరాజపురం సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా సిబ్బంది క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది యూనిఫాంతో విధులకు హాజరు కావాలని సూచించారు. అనంతరం ఆయన కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు.

సమష్టి కృషితోనే సత్ఫలితాలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యమని ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా సభ్యుడు ప్రొఫెసర్ తుప్పిల్ వెంకటేష్ తెలిపారు. స్విమ్స్‌లో సోమవారం అంతర్జాతీయ లీడ్ ఆడిటర్ సర్టిఫికెట్ ప్రోగ్రాం, ల్యాబొరేటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అవసరాలు అనే అంశంపై ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్‌లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. సంస్థ విజయవంతానికి అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో పనిచేస్తున్నారని కొనియాడారు. వైద్యసేవలతో పాటు టీచింగ్, పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, డాక్టర్లు కృష్ణమూర్తి, ఆనంద్, ఉషా ఆనంద్, రుక్మాంగద పాల్గొన్నారు.

మన బడిలో చేరుతున్నారు

- ప్రభుత్వ స్కూళ్లల్లో జోరుగా కొత్త అడ్మిషన్లు
- సర్కారు విద్యాసంస్థల్లోని విద్యార్థులే రాష్ట్రస్థాయిలో ర్యాంకర్లు
- ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం
- విశ్వాసం నింపుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- పుత్తూరులో ఇప్పటివరకు 466 అడ్మిషన్లు

ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలను కల్పించడంతో పాటు విప్లవాత్మకమైన పథకాలతో విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్న విషయం విదితమే. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి కోసం, పిల్లల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తుండడం విద్యాభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. దానికితోడు సర్కారు స్కూళ్లలోని విద్యార్థులే రాష్ట్రస్థాయిలో ర్యాంకర్లుగా నిలవడం గమనార్హం. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు క్యూ కడుతున్నారు.


పుత్తూరు మెయిన్ స్కూల్‌లో కొత్త అడ్మిషన్లు పొందిన విద్యార్థులు


గోవిందపాళెం ప్రాథమిక స్కూల్లో చేరిన విద్యార్థులు

పుత్తూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధనలతో మంచి ఫలితాలు సాధిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. దీంతో వేసవి సెలవుల్లోనే అడ్మిషన్లు జోరుగా జరుగుతున్నాయి. గతంలో కేవలం ప్రైవేటు స్కూళ్ల వైపే ఆసక్తి చూపే తల్లిదండ్రులు గత రెండేళ్లుగా తమ పంథా మార్చుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. మండలంలోని సీఆర్పీలు, ఉపాధ్యాయులు కొత్త అడ్మిషన్లు చేసుకునేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సైతం పర్యటిస్తూ బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేరిస్తున్నారు. గడచిన పది రోజుల్లో ఒక్క పుత్తూరు మండలంలోని ప్రభుత్వ స్కూళ్లలో 466 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో కొత్తగా చేరడం జరిగింది.

నాడు నేడుతో కార్పొరేట్ స్థాయి వసతులు..

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకాన్ని తీసుకువచ్చారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులు, ఫర్నీచర్ ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్ల ఏర్పాటు, ఆర్‌ఓ సిస్టమ్ ద్వారా తాగు నీటి సౌకర్యం కల్పించారు. అలాగే పిల్లల చదువుల కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన, విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీవిద్య వంటి విప్లవాత్మక పథకాలను అమలు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 21 నుంచి జగనన్న గోరుముద్ద ద్వారా బడి పిల్లలకు మరో పౌష్టికాహారంగా రాగిజావను సైతం అందజేస్తోంది. ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో పాటు కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలు ఉండడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

పుత్తూరులో ప్రభుత్వ పాఠశాలల వివరాలు.

పాఠశాలల కేటగిరి	సంఖ్య	విద్యార్థుల సంఖ్య	న్యూ అడ్మిషన్లు
ప్రాథమిక పాఠశాలలు	61	2,191	275
పాథమికోన్నత పాఠశాలు	5	855	27
ఉన్నత పాఠశాలలు	12	3,663	164
మొత్తం	78	6,709	466

ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోండి..



ప్రభుత్వం విద్యాపరంగా అందిస్తున్న ప్రోత్సాహకాలను తల్లిదండ్రులు అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే మండలంలో 466 అడ్మిషన్లు పూర్తయ్యాయి. తమ పిల్లల అడ్మిషన్ల కోసం కేవలం తల్లిదండ్రులు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చు. పాఠశాలల ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందించడం జరుగుతుంది.

– తిరుమలరాజు, ఎంఈఓ, పుత్తూరు

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



ఉత్తమ పంచాయతీ సర్పంచులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

వడమాలపేట : మండలంలో ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు, దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారానికి కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వడమాలపేట బైపాస్ రోడ్డులో పాదిరేడు జంక్షన్, వడమాలపేట మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని అన్నిశాఖల ప్రగతిపై అధికారులు నివేదిక చదివి వినిపించారు అనంతరం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గ్రామ సర్పంచులకు తొమ్మిది విభాగాల్లో ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రామాల్లో బాగా పని చేస్తున్న వలంటీర్లకు సేవారత్న, సేవావజ్ర పతకాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

వడమాలపేట : అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధ ఆలయం శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 8 వరకు టీటీడీ అధికారులు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాడ వీధుల్లో స్వామివారి ఊరేగింపు వాహనసేవలకు సంబంధించి సోమవారం ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమాడవీధుల్లో ముందస్తు వాహన సేవలు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లెలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో దాత జీలావారి కండ్రిగ గ్రామానికి చెందిన నంది బోయన హనుమంతయాదవ్, భారతి దంపతులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన భారీ ధ్వజస్తంభాన్ని వేద పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ గోవిందనామ స్మరణతో భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట జరిగింది. అలాగే ఆలయంలో ద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ధ్వజస్తంభ దాత గ్రామం నుంచి చెక్కభజనలు, కోలాటాలతో పాటు పెద్దఎత్తున బాణసంచాలు పేలుస్తూ అమ్మవారికి పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో వెయ్యిమందికి పైగా అన్నదానం నిర్వహించారు. అలాగే వెయ్యిమంది భక్తులకు ధర్మకర్త ధనగిరిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ సరఫరా చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి, కుప్పయ్య, రాజగోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, వెంకటేష్‌రెడ్డి, కృష్ణమండడి, మునిసుబ్రమణ్యం యాదవ్, మునిలక్ష్మి, చెంగల్రాయ యాదవ్, చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న భక్తులు

పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- చంద్రబాబు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మరు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: పేదల పక్షాన పోరాటం చేస్తూ అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అర్హతే ప్రామాణికంగా భావించి సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోమారు ఆదరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం శ్రీరంగరాజపురం పంచాయతీలోని నాయుడుపల్లి, సీకే పురం, పాతపాళ్యం, యూఎం పురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో పాతపాళ్యం గ్రామానికి చెందిన జ్యోతి అనే మహిళ మాట్లాడుతూ గతంలో తాము ఎన్నడూ ఇన్ని సంక్షేమ పథకాలను పొందలేదని, గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఓట్ల కోసం పసుపు కుంకుమ కింద రూ.10 వేలు వేసి వడ్డీతో సహా కట్టించుకున్నారని, అయితే జగనన్న ఏమీ ఆశించకుండా ఇన్ని పథకాలు అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. ఇప్పటికే తమ కుటుంబానికి రూ.10,26,956 పలు పథకాల ద్వారా సాయం అందిందని చెప్పింది. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా వచ్చే ఎన్నికల్లో తాము జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేస్తామని, చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా నమ్మమని, మరోమారు జగనన్నకే పట్టం కడతామని మంత్రి ఎదుట పలువురు మహిళలు ధైర్యంగా చెప్పారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా కులమతాలకు అతీతంగా ప్రతి మహిళా నోట జగనన్నే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. అభివృద్ధిని ఓర్వలేని చంద్రబాబు, ఎల్లోమీడియా, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ప్రభుత్వ పథకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. పాతపాళ్యం గ్రామంలో పలువురికి ఇంటి పట్టాలు, డ్రైనేజీ, తాగునీటి సమస్య, అర్హులకు భూ పట్టాలు అందించాలని, అలాగే యూఎం పురానికి రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యలను పరిష్కరించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ హరిత, ఎంపీటీసీ శివయ్య, మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురువారెడ్డి, నాయకులు కుప్పయ్య, జనార్దన్, బాలపరిమిళ, శ్రీధర్, రఘు, వరదయ్య, కరుణాకర్, ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఏడీఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూస్ డీఈ శైలజ, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

నగరి : పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను పఠిస్తూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు చేశారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పుష్పలత, వాసు, వనజ, బాలకృష్ణ, చిన్నబ్బ అన్నదాన ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించండి


మల్లారెడ్డికండ్రిగలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోమశేఖర్

విజయపురం (నగరి) : మండలంలోని శ్రీహరిపురం సచివాలయ పరిధిలోని మల్లారెడ్డికండ్రిగ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సోమశేఖర్ వైద్యశిబిరం నిర్వహించారు. రెండు రోజులుగా మల్లారెడ్డి కండ్రిగ గ్రామంలో కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు స్థానికులు చెప్పడంతో స్పందించిన ఆయన తన సిబ్బందితో సోమవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎనిమిది మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు ఇచ్చి అవగాహన సదస్సు కల్పించారు. ఇవి సాధారణ జ్వరాలని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి దోమల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. అయితే ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున బయట ఎవరూ తిరగవద్దని సూచించారు. ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రధానంగా నీరు అధికంగా తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్లు అనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు. గ్రామంలో జ్వరం తగ్గే వరకు 24 గంటలు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటారని, జ్వరానికి అవసరమైన మందులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శివముని, జనార్దన్, సీహెచ్ఓ సుబ్బరామమ్మ, పీహెచ్ఎన్ అన్నపూర్ణ, సూపర్‌వైజర్ మురళి, చింతామణి, ఏఎన్ఎం దివ్యప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ వినోలియా తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం..


పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి ఆర్కే రోజా సెల్వమణి దంపతులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అత్యంత కమనీయంగా, వైభవోపేతంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా, సెల్వమణి దంపతులు పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. అనంతరం వేద పండితులచే శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు పూర్ణకుంభంతో మంత్రి దంపతులకు స్వాగతం పలికారు. కల్యాణోత్సవం అనంతరం మంత్రి దంపతులను వేద పండితులు ఆశీర్వదించి, ఆలయ మర్యాదలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, కౌన్సిలర్లు రాధ, భానుమతి, ఏకాంబరం, నరసింహారావు, జాన్‌కెనడి, ఆలయ కమిటీ సభ్యులు సుందరం, రమేష్, బాబు, రుక్మిణి, విజయలక్ష్మి, భరణి, నాయకులు మనోహర్‌రెడ్డి, మురళీయాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్లోరింగ్ ప్రారంభం

శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫ్లోరింగ్‌ను మంత్రి ఆర్కే రోజా సోమవారం రాత్రి ప్రారంభించారు. ఆల య వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పలువురు దాతలు ఇచ్చిన రూ.6 లక్షలతో ఫ్లోరింగ్‌ను అందంగా తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు.


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

కిట్టన్న కందళిత సౌందర్యం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు, రచయితలు

తిరుపతి కల్చరల్: ఉపాధ్యాయుడు, కవి, రచయిత డాక్టర్ నెమిలేటి కిట్టన్న రాసిన కవితలకు ప్రతిరూపకంగా ప్రముఖ రచయిత కంపల్లె రవిచంద్రన్ రాసిన కందళిత సౌందర్యం పుస్తకాన్ని సోమవారం కరకంబాడి రోడ్డులోని ఓ ప్రయివేటు హోటల్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని అభ్యుదయ రచయితల సంఘం, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య సంయుక్తంగా చేపట్టాయి. తెలుగు భాషోద్యమ సమితి నేత సాకం నాగరాజు మాట్లాడుతూ కిట్టన్న కవిగా, రచయితగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. అధికార భాషా సంఘం సభ్యురాలు మస్తానమ్మ మాట్లాడుతూ, చెన్నై తెలుగు భాషోద్యమ నేత గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి పరితపించారని తెలిపారు. అనంతరం కిట్టన్న షష్టిపూర్తి కార్యక్రమాన్ని ఆయన పిల్లలు నెమిలేటి మౌనిక, హారిక, ప్రసన్నకుమార్ నిర్వహించారు. యమలా సుదర్శన్, శతావధాని ఆముదాల మురళి, అరసం అధ్యక్షుడు యువశ్రీ మురళి, మన్నవ గంగాధరప్రసాద్, పేరూరు బాల సుబ్రమణ్యం, తమటం రామచంద్రారెడ్డి, టింకాయల దామోదరం తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరుకు చేరిన పూల కుండీలు



పుత్తూరు రూరల్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇరువైపులా పూల కుండీలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి ఆర్‌కే రోజా ఆదేశాల మేరకు తిరుపతి తుడా సహకారంతో అందమైన పూల కుండీలను మున్సిపాలిటీకి తెప్పించినట్లు చెప్పారు. వీటిని ఫ్లైఓవర్‌పై దేవగన్నేరు పూల మొక్కలతో అందంగా అమర్చనున్నట్లు తెలిపారు.